## క్లుప్తంగా

### ఆదిత్యునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని సన్నిధిలో ఆదివారం స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆలయంలో వ్రత పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీవారు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అన్న సమారాధన జరిగింది.

### క్రికెట్ టోర్నీ విజేత గాడాల



బహుమతి అందుకుంటున్న విజేత జట్టు

రాజానగరం: నాని, వీరబాబు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో గాడాల టీమ్ విజేతగా నిలిచింది. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో తోకాడ టీమ్‌తో హోరాహోరీగా పోరాడి, విజయాన్ని సాధించింది. దీంతో విజేతకు షీల్డ్‌తో పాటు, రూ.33,333, రన్నర్‌కి రూ.15,555ను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సతీమణి బత్తుల వెంకటలక్ష్మి అందజేశారు.

### నేడు మహాన్న సమారాధన



రంగంపేటలో వీరభద్రస్వామి

రంగంపేట: మండలంలోని రంగంపేట గ్రామం శ్రీసాయినగర్‌లో కొలువైన వీరభద్రస్వామి ఆలయ వార్షికోత్సవం ముగింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం మహాన్న సమారాధన జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. భక్తులు అన్న సమారాధనలో పాల్గొనాలని కోరారు.

### ధాన్యపు గింజలతో గురూజీ చిత్రం



ధాన్యపు గింజలతో వేసిన గురూజీ చిత్రంతో బబ్లూ

రాజానగరం: మండలంలోని దివాన్‌చెరువుకు చెందిన బబ్లూ అనే యువకుడికి ఫైన్ ఆర్ట్స్ అంటే ఎంతో ఇష్టం. ఢిల్లీలో ఆర్ట్స్ అండ్ క్రాఫ్టస్ కోర్సు చేస్తున్న ఇతడు తరచూ ఏదో ఒక బొమ్మను గీస్తూ తన ప్రతిభను చాటుకునే ప్రయత్నం చేస్తుంటాడు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బబ్లూ తండ్రి రమేష్ కుటుంబ సమేతంగా పాతికేళ్ల క్రితం దివాన్‌చెరువు వచ్చారు. అప్పటి నుంచి ఇక్కడే పానీపూరీ విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న అతను పానీపూరీ రమేష్‌గా స్థానికులకు సుపరిచితుడు. ఏప్రిల్‌లో రెండు లక్షల ధాన్యపు గింజలతో వేంకటేశ్వరుని బొమ్మను చిత్రీకరించి, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందాడు. ఈసారి తనకెంతో ఇష్టమైన, తమ ప్రాంతానికి చెందిన గురుదేవ్ అంబాజీ ధామ్ నిపాన్య చిత్రాన్ని లక్ష ధాన్యపు గింజలతో వారం రోజుల్లో చిత్రీకరించాడు. ఆ చిత్రపటాన్ని స్వయంగా ఆయనకు ఈ నెల ఐదున అందజేస్తానని బబ్లూ తెలిపాడు. అంబాజీ ధామ్ నిపాన్యను అంతా గురూజీగా ఆరాధిస్తారని చెప్పాడు. ఆ రాష్ట్రంలోని మందసౌర్ జిల్లాలో శ్రీమత్ దేవి భాగవత్ కథను గురూజీ ఆరు రోజులు చెప్పి, ఆఖరి రోజున నిర్వహించే దివ్య దర్బార్‌లో కళ్లకు గంతలు కట్టుకుని, ఎదుటివారి భవిష్యవాణి వివరిస్తారని తెలిపాడు.

### హెచ్‌ఎంగా రమాదేవి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా తనికెళ్ల రమాదేవి ఆదివారం బాధ్యతలు తీసుకున్నారు. రాజవోలు స్కూల్ అసిస్టెంట్‌గా సేవలు అందించిన ఈమె ఇటీవల పదోన్నతుల్లో భాగంగా బిక్కవోలు హెచ్‌ఎంగా నియమితులయ్యారు. ఉపాధ్యాయుల సహకారంతో పాఠశాలను అభివృద్ధి దిశగా తీసుకెళతానని ఆమె తెలిపారు. ఇక్కడి హెచ్‌ఎం ప్రభాకర్‌రావు బలభద్రపురం ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు.

# ముందే పాడిన తొలకరి రాగం

- వర్షపు జల్లులతో మెట్ట రైతుల్లో ఆనందం
- ఖరీఫ్ వరి సాగుకు అన్నదాతల సమాయత్తం
- నారుమడులతో శ్రీకారం



నరేంద్రపురం గ్రామంలో నారుమడి కోసం పొలాన్ని దున్నుతున్న రైతు



నారుమడిలో విత్తనాలు చల్లుతున్న రైతు

రాజానగరం: నైరుతి రుతుపవాలు కాస్త ముందుగానే పలకరించడంతో మెట్టలో ఖరీఫ్ వరి సాగుకు అన్నదాతలు సమయాత్తమయ్యారు. అడపాదడపా కురుస్తున్న తొలకరి జల్లులు తొలకరి పంట సాగుకు అనుకూలతను చూపుతున్నాయి. సాధారణంగా ఖరీఫ్ సీజన్‌లో వరి పంట చేతికొచ్చే సమయంలో తుపాన్ల తాకిడి ఎక్కువగా ఉంటుంది, ఆ ఇబ్బందులు ఎదురుకాకుండా సకాలంలో సాగను చేపట్టాలని వ్యవసాయధికారులు చేస్తున్న సూచనల నేపథ్యంలో వాతావరణం కూడా అనుకూలించడం రైతాంగాన్ని మరింత ఉత్తేజపరుస్తోంది. అధిక దిగుబడులిచ్చే వరి వంగడాలను ఎంచుకునే పనులను అధిగమించి, నార్లు వేయడంలో బిజీగా ఉన్నారు.

సాగు నీటి సదుపాయాలు సమృద్ధిగా లేకపోయినా కానీ, గొట్టపు బావుల సదుపాయంతో పాటు, రుతుపవనాల రాకతో మెట్ట ప్రాంతంలో రైతులు ఖరీఫ్ వరి సాగుకు శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలో సాగులో ముందుండే నరేంద్రపురం, తూర్పుగానుగూడెం, కలవచర్ల, వెలుగుబంద, రాజానగరం ప్రాంతాల్లో ప్రస్తుతం వరి నారుమడులు వేయడంలో రైతులు బిజీగా ఉన్నారు. ఆరోగ్యవంతమైన నారును పొందాలంటే మేలైన యాజమాన్య పద్ధతులను అనుసరించాల్సి ఉంటుంది. దీంతో సమీపంలో ఉన్న రైతు సేవా కేంద్రాల సహాయకుల ద్వారా వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు ఇచ్చిన సూచనలను పాటిస్తూ నారు కట్టడంలో నిమగ్నమయ్యారు.

**నారుమడి తయారీ ఇలా..**

వేసవిలోనే కొంతమంది రైతులు తమ పొలాల్లో వేసవి దుక్కులు పూర్తి చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఆయా ప్రాంతాల్లోని పొలాలను మరోసారి చదును చేసి, నారుమడులు కట్టేందుకు వీలుగా తయారుచేస్తున్నారు. నారు పోయాల్సిన మడిని 10 - 12 రోజుల్లో మూడు దఫాలుగా దున్ని చదును చేయాలి. నీరు పెట్టేందుకు, ఎక్కువైతే తీయడానికి వీలుగా ఎత్తు, పల్లాలు లేకుండా చదును చేయాలి. నీరు నిల్వ ఉంటే వేసిన విత్తనం మురిగిపోతుంది. ఈ కారణంగానే చాలామంది రైతులు మడుల్లో అక్కడక్కడా నీరు పోయేందుకు వీలుగా కాలువలు తీస్తుంటారు. ఎకరం పొలంలో నాట్లు వేసేందుకు నారును దంప నారుమడికైతే ఐదు సెంట్లు, బెంగాలీ నారుమడికైతే మూడు సెంట్లు సరిపోతుంది. సెంటు భూమికి ఐదు కిలోల విత్తనాలు చల్లాలి. మడిలో విత్తనాలు చల్లిన తరువాత ఐదు సెంట్ల మడికి రెండు కిలోల భాస్వరం, కిలో పొటాష్ ఉండే ఎరువులను వాడటం శ్రేయస్కరం.

**విత్తన శుద్ధి చేయాలి**

నారు పోసేముందు మంచి దిగుబడులు ఇచ్చే విత్తనాలను ఎంపిక చేసుకుని, వాటిలో మొలక శాతాన్ని పరిశీలించాలి. అనంతరం ఆ విత్తనాలను శుద్ధి చేయడం ద్వారా తెగుళ్లు సోకకుండా చాలావరకు నివారించవచ్చు. ఇందుగాను కిలో విత్తనాలకు 2.5 గ్రాముల కార్బండిజంతో కలిపి రోజంతా నానబెట్టాలి. లేకుంటే కిలో విత్తనాలకు మూడు గ్రాముల కాప్టన్ మందు కలిపి మడిలో చల్లాలి. దీంతో నారుమడిలో ఆకు తినే పురుగు, ఉల్లికోడు, ముప్వ పురుగులను ఆశించకుండా అరికట్టవచ్చు.

**మార్టేరులో నూతన వరి వంగడాలు**

బీపీటీ 5204 సన్న వరి వంగడానికి ప్రత్యామ్నాయంగా మార్టేరు శాస్త్రవేత్తలు ఎంటీయూ 1224, ఎంటీయూ 1262 వరి వంగడాలను తయారుచేశారు. ఎంటీయూ 1224 రకం 140 రోజులు, ఎంటీయూ 1262 రకం 150 రోజుల్లో కోతకు వస్తాయి. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసేందుకు ఆసక్తి ఉన్న రైతులు మార్టేరు నుంచి పొందవచ్చు. పూర్తి వివరాలకు 99896 23805 నంబరుకు కాల్ చేసి తెలుసుకోవచ్చు.

– డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు, శాస్త్రవేత్త, జిల్లా ఏరువాక కేంద్రం, దివాన్‌చెరువు

### ఆలయానికి నేడు శంకుస్థాపన

బిక్కవోలు: పందలపాక వెలంపేటలో కొలువైన అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి నూతన ఆలయానికి సోమవారం శంకుస్థాపన చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఆలయం పునర్నిర్మాణంలో భాగంగా శంకుస్థాపన జరుగుతుందన్నారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. రాజమహేంద్రవరానికి చెందిన రెడ్డి వెంకటచిన్నారావు, రేణుకాదేవి దంపతులు కర్తగా వ్యవహరిస్తారని తెలిపారు.

### ఎట్టకేలకు మృతదేహానికి అంత్యక్రియలు

సీతానగరం: మండలంలోని మిర్తిపాడుకు చెందిన గద్దె ప్రభావతి (76) మృతదేహానికి ఆదివారం ఎట్టకేలకు దహన సంస్కారాలు నిర్వహించారు. ప్రభావతి పెద్ద కుమారుడు మూడు ఎకరాలు తీసుకున్నాడని, రెండో కుమారుడి కుటుంబ సభ్యులకు 1.50 ఎకరం ఇవ్వాలని గ్రామస్తులు శనివారం మృతదేహాన్ని శ్మశాన వాటికకు తీసుకువెళ్లకుండా అడ్డుకున్న సంగతి విదితమే. ప్రభావతి రెండో కుమారుడు కొన్నేళ్ల క్రితం మరణించగా.. అతడి భార్య అనంతలక్ష్మి ఉద్యోగం చేస్తున్న కుమారులతో విశాఖపట్నంలో ఉంటుంది. ప్రభావతి పెద్ద కుమారుడు నాగేశ్వరరావు వద్ద ఉంటుంది. తల్లి ఆలనాపాలనా తనే చూశానని, మూడు ఎకరాలు తనకే రాసిందని తెలపడంతో గ్రామస్తులు మృతదేహాన్ని అడ్డుకున్నారు. ఆదివారం గ్రామస్తులు పెద్ద కుమారుడితో చర్చలు జరిపి, ఎకరం పొలం ఇచ్చేలా ఒప్పందం కుదిర్చిన అనంతరం.. ప్రభావతి మృతదేహానికి దహన సంస్కారాలు పూర్తి చేశారు.

# 4న వెన్నుపోటు దినం



పోస్టర్‌ను విడుదల చేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు

- వైఎస్సార్ సీపీ అమలాపురం పార్లమెంటరీ పరిశీలకురాలు విజయలక్ష్మి
- పోస్టర్ విడుదల

రాజానగరం: రాష్ట్ర ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఎటువంటి హామీలను నెరవేర్చకపోవడాన్ని నిరసిస్తూ జూన్ 4న వెన్నుపోటు దినాన్ని నిర్వహిస్తున్నామని వైఎస్సార్ సీపీ అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి తెలిపారు. ఈ పోస్టర్‌ని మండలంలోని పల్ల కడియంలో ఆదివారం విడుదల చేశారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ అంటూ అమలు చేయలేని హామీలను గుప్పించిన పాలకులు వాటిని మర్చిపోయారన్నారు. ఓటు వేసి, అధికారాన్ని కట్టబెట్టిన ప్రజలను హేళన చేస్తున్నట్టుగా సూపర్ సిక్స్ పేరుతో మద్యం బ్రాండ్‌ని మార్కెట్‌లోకి తెచ్చారని విమర్శించారు. మహిళలను, రైతులను, విద్యార్థులను, నిరుద్యోగులను ఇలా ప్రతి ఒక్కరినీ హామీలతో మాయ చేశారన్నారు. ఈ కారణంగానే ప్రభుత్వానికి బుద్ధి చెప్పడంతో పాటు, ప్రజలలో చైతన్యం తెచ్చేలా వెన్నుపోటు దినాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులన్నీ పాల్గొని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, పార్టీ మండల కన్వీనర్ దూలం పెద్ద, కో–కన్వీనర్ గండి నానిబాబు, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు అడబాల చినబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బత్తుల వెంకట్రావు, ఎం.సూర్యనారాయణ, గొర్రెల శివప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వ్యవస్థల విధ్వంసకర్త చంద్రబాబే

- నాడు సొంత మామకు, నేడు నమ్ముకున్న ప్రజలకు వెన్నుపోటు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ
- అనపర్తిలో వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వేణుగోపాలకృష్ణ, డాక్టర్ సూర్యనారాయణరెడ్డి తదితరులు

అనపర్తి : రాష్ట్రంలో వ్యవస్థలను విధ్వంసం చేస్తున్నది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ తీవ్రంగా విమర్శించారు. ఆదివారం పార్టీ అనపర్తి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డితో కలసి వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ, నాడు పిల్లనిచ్చిన మామకు వెన్నుపోటు పొడిచి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన చంద్రబాబు.. మరోసారి ప్రజలకు వెన్నుపోటు పొడిచి సీఎం పదవిని చేపట్టారని విమర్శించారు. ప్రజల సౌకర్యార్థం ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చక్కటి వ్యవస్థలను ఏర్పాటు చేస్తే.. కూటమి ప్రభుత్వం వాటిని విధ్వంసం చేసి ప్రజలను కష్టపెడుతోందన్నారు. ఇంటింటి రేషన్ విధానాన్ని రద్దు చేసి పేద, సామాన్య ప్రజలను అవస్థలకు గురి చేస్తున్నారన్నారు. నాడు పరిమితంగా మద్యం షాపులు కేటాయిస్తే, నేడు వీధివిధినా బెల్టుషాపులు వెలసి రాష్ట్రం మద్యాంధ్రప్రదేశ్‌గా మారిందన్నారు. అధికారం చేపట్టి ఏడాదవుతున్నా సూపర్ సిక్స్‌లోని కనీసం ఒక్క పథకం కూడా అమలు చేయలేదని దుయ్యబట్టారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు అన్ని నియోజకవర్గాల్లో ఈ నెల 4న చేపట్టనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని అనపర్తి నియోజకవర్గంలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అనపర్తి సర్పంచ్ వారా కుమారి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పార్టీ బూత్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు ముత్యాలరావు, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు వల్లభశెట్టి సతీష్, పార్టీ పట్టణ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, పెదపూడి, బిక్కవోలు మండలాల కన్వీనర్లు గుత్తుల వెంకటరమణ, పోతుల ప్రసాదరెడ్డి, లీగల్, బీసీ విభాగాల నియోజకవర్గ అధ్యక్షులు వెలగల లక్ష్మీనారాయణరెడ్డి, కొండేటి భీమేశ్వరస్వామి, ఎంపీటీసీ సభ్యులు బండారు శ్రీను, ఏడుకొండలు, వైస్ ఎంపీపీ కర్రి దాసు, కానూరు కృష్ణ, మాజీ ఎంపీపీ బుద్దాల కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

# తొలిరోజు నుంచే నిరీక్షణ



బిక్కవోలు రేషన్ షాపు వద్ద నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

### రేషన్ షాపు వద్ద లబ్ధిదారుల పడిగాపులు

బిక్కవోలు: మండలంలోని కూటమి ప్రభుత్వం పాత రేషన్ విధానం అమల్లోకి తెచ్చింది. ఆదివారం ప్రజలు రేషన్ సరకులు తీసుకునేందుకు ఉదయం నుంచి రేషన్ దుకాణానికి వెళ్లారు. అయితే ప్రారంభించిన కొంత సమయానికే సర్వర్ పనిచేయకపోవడంతో ప్రజలకు నిరీక్షణ తప్పలేదు. మొత్తం 40 షాపుల ద్వారా 23,148 రేషన్ కార్డు లబ్ధిదారులకు సరకులు అందించాలి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ సరకులను పంపిణీ చేసేది. కూటమి ప్రభుత్వం వచ్చాక కేవలం బియ్యం మాత్రమే ఇస్తున్నారు. కందిపప్పు ఐదు నెలలుగా ఇవ్వడం లేదు. పంచదార ఒక నెల ఉంటే, మరో నెల ఉండడం లేదని రేషన్‌కార్డుదారులు గగ్గోలు పెడుతున్నారు. ఇలాంటి సమయంలో మరలా రేషన్ షాపు వద్దకు వెళ్లి బియ్యం కోసం గంటల తరబడి ఈ నిరీక్షణ ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నిబంధనల ప్రకారం చేపట్టాలి**

పెదపూడి: నిబంధనల ప్రకారం రేషన్ కార్డు లబ్ధిదారులకు సరకులు పంపిణీ చేపట్టాలని తహసీల్దార్ పీవీ సీతాపతిరావు అన్నారు. మండలంలో రామేశ్వరం, ఏపీత్రయం, పెదపూడి, కరకుదురు తదితర గ్రామాల్లో రేషన్ సరకుల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 42 రేషన్ షాపుల్లో 23,275 మంది కార్డుదారులకు సరకులు పంపిణీ చేయనున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కలవల కృష్ణమూర్తి, ఎంపీటీసీ సభ్యురాలు వల్లూరి మరియమ్మ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి, మాజీ ఎంపీపీ జుత్తక సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ బొబ్బిల్లంక రేషన్ షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా వృద్ధులకు, వికలాంగులకు రేషన్ సరకులు అందించారు. మండలంలో పలు రేషన్ షాపులను రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి ప్రారంభించారు.

# ఘనంగా వెదుళ్లమ్మవారి జాతర



అమ్మవారి సన్నిధిలో పార్టీ నేతలతో జక్కంపూడి విజయలక్ష్మి

సీతానగరం: మండలంలోని వెదుళ్లపల్లిలో గ్రామ దేవత వెదుళ్లమ్మ అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా జరిగింది. వైఎస్సార్ సీపీ అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి పార్టీ నాయకులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ, 12 ఏళ్లకు ఓసారి నిర్వహించే జాతరలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నట్టు ఆమె తెలిపారు. ఐదు రోజుల పాటు జరిగే జాతరలో చుట్టుపక్కల ప్రాంతాల వారు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించారు. వైస్ ఎంపీపీలు ముదునూరి సురేష్‌రాజు, సత్యం మదన్‌బాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా శ్రీనివాస్, కో–కన్వీనర్ చిట్టూరి శ్రీహరిబాబు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వలవల వెంకట్రాజు, నాయకులు సత్యం రాంపండు, కవల కృష్ణమూర్తి, బొమ్ముల శ్రీను తదితరులు పాల్గొన్నారు

# ఆరోగ్య ప్రదాయిని యోగా



కోరుకొండలో శిక్షణ పొందుతున్న సిబ్బంది, స్థానికులు



కొంకుదురులో యోగా శిక్షణలో పాల్గొన్న సిబ్బంది

కోరుకొండ: దైనందిన జీవితంలో యోగా ఆరోగ్య ప్రదాయిని అని సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ అన్నారు. నిత్యం యోగాసనాలను వేయడం ద్వారా ఆరోగ్యం సిద్ధిస్తోందని చెప్పారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆదివారం ఉదయం యోగా శిక్షణ ప్రారంభించారు. ఈ నెల ఐదు వరకు ఉదయం 6 నుంచి శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారంతా పాల్గొనాలని కోరారు. వ్యవసాయ శాఖ ఏడీ మల్లికార్జునరావు మాట్లాడుతూ, నిత్యం యోగా చేయడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబు, కర్రి గణేష్ తదితరులు పాల్గొన్నారు.


**యోగా శిక్షణ ప్రారంభం**

బిక్కవోలు: యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కొంకుదురులో ఆదివారం యోగా శిక్షణ ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి కర్రి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో యోగా గురువు ద్వారంపూడి సాయిరామారెడ్డి శిక్షణ ఇచ్చారు. ప్రతిరోజు ఉదయం శిక్షణ ఇస్తారన్నారు. పంచాయతీ, రెవెన్యూ సిబ్బందితో పాటు, గ్రామ ప్రజలు శిక్షణలో పాల్గొన్నారు.

### సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకాలు

సీతానగరం: ముగ్గళ్ల శివాలయంలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. షష్ఠి తిథితో పాటు, ఆశ్లేష నక్షత్రం స్వామివారికి ప్రీతికరమైనది. దీంతో ఉమారామ లింగేశ్వర స్వామిని, వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్లకు అధిక సంఖ్యలో భక్తులు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు కొడమంచిలి వినేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### అమెరికా కాన్ఫరెన్స్‌కు డాక్టర్ శేఖరరెడ్డి



అనపర్తి: ఎండోక్రైన్ హార్మోన్ల సమస్యలపై అమెరికాలోని కాలిఫోర్నియాలో జూలై 12 నుంచి నాలుగు రోజుల పాటు జరిగే అతి పెద్ద ఇండో సొసైటీ–2025 కాన్ఫరెన్స్‌కు అనపర్తికి చెందిన అభిరామ్ డయాబెటిస్ ఎండోక్రైన్ వైద్య నిపుణులు ఎంవీ శేఖరరెడ్డి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ శేఖరరెడ్డి ఆదివారం ఇక్కడ మాట్లాడుతూ, ఈస్ట్రోజన్ రెసిడెన్‌రోమ్ రుతుక్రమ సమస్యపై, అలాగే శిశువులో కంజెనిటికల్ హైపో పిట్యూటరిజం వంటి అరుదైన కేసులపై కూడా అంతర్జాతీయ స్థాయిలో చర్చించనున్నట్టు వివరించారు. ఈ సందర్భంగా ఆయనకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అనపర్తి శాఖ అధ్యక్షుడు డాక్టర్ తాడి రామగురెడ్డి, కార్యదర్శి నవీన్‌రెడ్డి, పలువురు వైద్య ప్రముఖులు అభినందనలు తెలిపారు.

### ప్రైవేటీకరణపై మౌనం వీడాలి

**సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు**

ప్రకాశం నగర్: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మౌనం వీడాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కృష్ణా–గోదావరి బేసిన్‌లో లభ్యమవుతున్న గ్యాస్, చమురు సహజ వనరులపై అప్పుల్లో ఉన్న ఆంధ్రాకు వాటా దక్కాలని కోరుతూ జూలైలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. నెల రోజులుగా విశాఖపట్నంలో కార్మికులు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం అన్ని రాజకీయ పార్టీలను సమైక్యపర్చి.. నిరంతర పోరాటం సాగిస్తామన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, సహాయ కార్యదర్శి కె.రాంబాబు, వి.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.